
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 36.0 | కనిష్ఠం : 22.0

ANDHRAJYOTHY

5



జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు


శుక్రవారం 21 ఫిబ్రవరి 2025

రేపు వనపర్తికి వ్యవసాయ శాఖ మంత్రి రాక

వనపర్తి అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లాలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించేందుకు శనివారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రానున్నట్లు జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి సీతారాం నాయక్ గురువారం తెలిపారు. వెల్టూరులో పీహెచ్‌సీ, మోజర్ల సమీపంలో గోదాంను ప్రారంభించనున్నారు. సంకిరెడ్డిపల్లి సమీపంలో ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు భూమిపూజ నిర్వహించనున్నారు. పెబ్బేరు, గోపాల్‌పేట, ఖిల్లాఘణపురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

అవినీతికి అందలం

● విద్యాశాఖలో చేతివాటం



● పాఠశాలల ఏర్పాటుకు 42 దరఖాస్తులు



జిల్లాలో నూతన పాఠశాలల ఏర్పాటుకు అనుమతులకోసం 42 దరఖాస్తులు వచ్చాయి. అందులో ఎనిమిది రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యాలయానికి పంపించాం. మిగతావి ఎందుకు పంపించలేదో పరిశీలిస్తా. ప్రైవేట్ పాఠశాల అనుమతుల విషయంలో పలువురు డబ్బులు వసూలు చేస్తున్నారన్న విషయం నా దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ చేయిస్తా. అక్రమ డిప్యుటేషన్‌కు సంబంధించి అందరినీ తొలగించాలని ఎంఈవోలకు ఇప్పటికే సమావేశంలో ఆదేశించా.. ఇందుకు సంబంధించి మా కార్యాలయ సూపరింటెండెంట్‌కు సర్క్యులర్ ఇవ్వాలని వారం రోజుల కిందటే చెప్పాను. ఇప్పటి వరకు నా వద్దకు రాలేదు. దీనిపై కూడా పరిశీలించి చర్యలు తీసుకుంటా.

- ప్రవీణ్‌కుమార్, డీఈవో మహబూబ్‌నగర్

- ఫైల్ కదలాలంటే... చెయ్యి తడపాల్సిందే!
- ప్రైవేట్ పాఠశాలల అనుమతులకు రూ.లక్షలు వసూలు
- ఇవ్వకుంటే ఫైల్ మాయం
- బాస్ చెప్పినా కదలని టీచర్ల డిప్యుటేషన్ల రద్దు ఫైల్

6

విద్యాశాఖ కార్యాలయంలో అవినీతి కంపు కొడుతోంది. అధికారుల భాగోతం కారణంగా అవినీతి మరకలు అంటుకున్నాయి. అక్రమ సంపాదన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. ఓ ఫైల్ ముందుకు కదలాలంటే ఆ అధికారి చేయి తడపాల్సిందే.. అన్న రీతిన వ్యవహారం కొనసాగుతోంది. ఒకవేళ చేయి తడపకపోతే ఆ ఫైల్ ఆ సెక్షన్‌లో కనిపించకుండానే మాయం అవుతుండటం గమనార్హం. మహబూబ్‌నగర్ జిల్లాలో 42 పాఠశాలల ఏర్పాటు కోసం నిరుద్యోగులు, ఇతరులు దరఖాస్తులు చేసుకున్నారు. గత నెల 15వ తేదీ నాటికి గడువు కూడా ముగిసింది. అయితే, వీటి కదలిక ప్రక్రియలో అవినీతి ఆజ్యం పోసుకున్నది. సంబంధిత సిబ్బంది చేతివాటంతో కేవలం 8 దరఖాస్తులకు సంబంధించిన ఫైల్స్ మాత్రమే రాష్ట్ర శాఖ కార్యాలయానికి చేరుకున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మిగతా వాటికి సంబంధించి దరఖాస్తుదారుల నుంచి డబ్బులు వసూలు కోసం సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం ఎక్కడిదాక పోతుందో మరి.

- మహబూబ్‌నగర్ విద్యావిభాగం, (ఆంధ్రజ్యోతి)

గంజాయి, సారాపై ఉక్కుపాదం

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఎంతటి వారైనా ఉపేక్షించొద్దని ఆదేశాలు
- పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులతో సమీక్ష

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను గంజాయి, సారా రహితంగా మార్చేందుకు ఎక్సైజ్, పోలీస్ శాఖ పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్‌వైభవ్ రఘునాథ్, ఎమ్మెల్యేలు డాక్టర్ రాజేష్‌రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డిలతో కలిసి ఎక్సైజ్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశానికి యువత అత్యుత్తమమైన సంపద అని తెలిపారు. వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పేదలు సారా తాగి ఇల్లు, ఒళ్లుగుల్ల చేసుకుంటున్నారన్నారు. యువకులు డ్రగ్స్, గంజాయి లాంటి మత్తుకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరినీ ఉపేక్షించవద్దని సారా తయారీపై ఉక్కుపాదం మోపాలని మంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి సాగు, నాటుసారా తయారీ జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో రాష్ట్రస్థాయి నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలు దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు చేపట్టిన అవగాహన కార్యక్రమాలను, తనిఖీల్లో నమోదు చేసిన కేసుల వివరాలను కలెక్టర్, ఎస్పీ మంత్రికి వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, ఎక్సైజ్ పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్‌వైభవ్ రఘునాథ్, ఎమ్మెల్యేలు డాక్టర్ రాజేష్‌రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి

భవిష్యత్ తరాలకు మేథో సంపత్తి హక్కులు



సమావేశంలో మాట్లాడుతున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

- నూతన ఆవిష్కరణలు జరిగిన వెంటనే పేటెంట్ హక్కులు పొందాలి
- వీసీ జీఎన్ శ్రీనివాస్
- పీయూలో ఒక రోజు ఆర్గనైజేషనల్ ప్రోగ్రాం

6

ఉత్సాహంగా కుస్తీ పోటీలు

- పాల్గొన్న వివిధ ప్రాంతాల బలభీములు
- అయిజలో తిక్కవీరేశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు
- ఉత్సాహంగా తిలకించిన ప్రజలు

6



పోటీలో తలపడుతున్న బలభీములు

రూ.2కోట్లకు చేరిన బకాయిలు

- పేరుకుపోతున్న గద్వాల మునిసిపల్ దుకాణాల అద్దెలు
- దుకాణదారులకు నోటీసులు జారీ
- సీజ్‌కు సిద్ధమవుతున్న అధికారులు

6



దుకాణదారులతో అద్దె వసూలు చేస్తున్న మునిసిపల్ రెవెన్యూ అధికారులు

ఉద్యమ తరహాలో తెలుగుభాష పరిరక్షణ

- అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' చర్చా వేదికలో కవులు, విద్యావేత్తల పిలుపు
- పాలకుల నిర్లక్ష్యం వల్లే తెలుగు భాష నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన
- ప్రభుత్వ ఉత్తర్వులన్నీ తెలుగులోనే రావాలని సూచన
- ప్రాథమిక విద్యాభ్యాసమంతా తెలుగులోనే కొనసాగాలని పిలుపు
- ప్రపంచ భాషలతో పోటీపడుతున్న తెలుగు ఔన్నత్యాన్ని కాపాడాలని కోరిన మేధావులు



నాగర్‌కర్నూల్/ కందనూలు/ బిజినేపల్లి/ తాడూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : పరభాష మోజులో తెలుగు భాషను నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదని పలువురు కవులు, విద్యావేత్తలు పేర్కొన్నారు. ప్రపంచంతో పోటీ పడాలంటే పరభాష అవసరమైనప్పటికీ తల్లిదండ్రులు వారి పిల్లలకు తెలుగుభాష ప్రాధాన్యం, దాని ప్రాశస్త్యం గురించి కూడా వివరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వారు స్పష్టం చేశారు. తెలుగు భాష పరిరక్షణ ఓ సామాజిక ఉద్యమంలా కొనసాగాలని వారు అభిలాషించారు. గురువారం ఉదయం నాగర్‌కర్నూల్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ఆధ్వర్యంలో మాతృభాష పరిరక్షణ మన బాధ్యతలు అనే అంశంపై చర్చా వేదిక జరిగింది. జిల్లాలోని కవులు, కళాకారులు, విద్యావేత్తలు చర్చా వేదికకు హాజరయ్యారు. చర్చా వేదికలో పాల్గొన్న వారంతా తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడటానికి ఆంధ్రజ్యోతి చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ తమ ప్రసంగాలను కొనసాగించారు. విద్యావేత్త రిటైర్డు ప్రిన్సిపాల్ సి.భాస్కర్‌రావు మాట్లాడుతూ అర్థవంతమైన చర్చలకు చాలా మంది దూరమైన నేపథ్యంలో భాష పరిరక్షణకు ఆంధ్రజ్యోతి

- మిగతా 7లో..



ఆంధ్రజ్యోతి చర్చా వేదికలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ రాజేందర్

నేటి సీఎం పర్యటనకు సర్వం సిద్ధం



- వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- అప్పక్‌పల్లి మెడికల్ కాలేజీ దగ్గర సీఎం బహిరంగ సభ
- సింగారం చౌరస్తా దగ్గర హెలిప్యాడ్ ఏర్పాటు
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యేలు, మల్టీజోన్-2 ఐజీపీ
- వెయ్యి మందితో భారీ పోలీస్ బందోబస్తు

6

నారాయణపేట జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం రానున్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లకు సర్వం సిద్ధం చేశారు. అప్పక్‌పల్లి మెడికల్ కళాశాల దగ్గర దాదాపు రూ.100 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపనల శిలాఫలకాలను సీఎం ఆవిష్కరించనున్నారు.

- నారాయణపేట, (ఆంధ్రజ్యోతి)



సీఎం బహిరంగసభ వేదికను పరిశీలిస్తున్న మల్టీజోన్-2 ఐజీపీ సత్యనారాయణ, ఎస్పీ యోగేష్ గౌతమ్ తదితరులు



మెడికల్ కాలేజీ దగ్గర సీఎం బహిరంగ సభా వేదికపై ఎమ్మెల్యేలు

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం

- గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్
- గట్టు బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ

గట్టు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జోగుళాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనశాలకు వెళ్లి నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు. భోజనం రుచిగా ఉందా అని విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం గదిని, వంట సామగ్రి, స్టాక్‌రూంలో నిల్వ ఉంచిన బియ్యం, రాగి పప్పులు, చక్కెర, బెల్లం, ఇతర సరుకులను పరిశీలించి కాలపరిమితిని తెలుసుకున్నారు. వంట గది శుభ్రతగా ఉండాలని ఆదేశించారు. నాసిరకమైన కూరగాయాలు, బియ్యం అందిస్తే తిరిగి పంపాలని సూచించారు. కలెక్టర్ వెంట ప్రిన్సిపాల్ శోభారాణి, తహసీల్దార్ సలీముద్దీన్, స్పెషల్ ఆఫీసర్ గోవిందయ్య, షకీలాబాను, సంగీత తదితరులు ఉన్నారు.

జాబ్ కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి పని

జాబ్ కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి పని కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. జాబ్‌కార్డు మంజూరు, డేటా ఎంట్రి వివరాలతో పాటు రికార్డులను తనిఖీ చేశారు. పనుల పురోగతి పెంచాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఎంపీడీవో చెన్నయ్య, ఏపీవో స్వామి పాల్గొన్నారు.



గట్టు గురుకులంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ సంతోష్

ముంపు భూములపై నివేదిక ఇవ్వండి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి
- రాయ సముద్రాన్ని పరిశీలించిన అధికారులు



రాయసముద్రం వద్ద నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

కొత్తకోట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని రాయనిపేట శివారులోని రాయ సముద్రం నీటిలో ముంపునకు గురవుతున్న భూములపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. రాయసముద్రంలో రాయనిపేట గ్రామానికి 175 ఎకరాలు వనపర్తి మండలం కడుకుంట్లకు చెందిన 358 ఎకరాలు ముంపునకు గురవుతున్నాయి. ఆ భూముల రైతులు లోకాయుక్తను ఆశ్రయించారు. వారి ఆదేశాల మేరకు గురువారం రాయ సముద్రాన్ని నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ముంపు బాధిత రైతులతో మాట్లాడారు. భీమా కాలువ నీరు రాక ముందు యాసంగిలో పంటల సాగు చేసుకునే వారమన్నారు. నేడు నీళ్లు నిండుగ ఉండడంతో సాగు చేయడానికి అవకాశం లేదని తెలిపారు. యాసంగి పంటలు సాగు చేసుకోనే అవకాశం, లేదంటే పరిహారం ఇప్పించాలని విన్నవించారు. ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డికి చేపట్టాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్లు రమేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఏవో యాస్మిన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా కుస్తీ పోటీలు



అయిజలో కుస్తీ పోటీలలో పాల్గొనటానికి వచ్చిన వివిధ రాష్ట్రాలకు చెందిన బలభీములు

అయిజ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో గురువారం జరిగిన జాతీయ స్థాయి కుస్తీ పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. తిక్క వీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ పోటీలు ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్, కర్ణాటకకు చెందిన శివానంద్‌లతో పోటీలు ప్రారంభం అయ్యాయి. మధ్యాహ్నం ప్రారంభమైన పోటీలు రాత్రి 7 గంటల వరకు కొనసాగాయి. పోటీల్లో పాల్గొన్న బలభీములు తమ కండ బలముతో పాటు చాకచక్యం, ప్రావీణ్యాన్ని కనబరిచారు. కదన రంగంలో వివిధ రకాల చేతి పట్టులను ఉపయోగించి ప్రత్యర్థులను మట్టి కరిపించారు. దంగల్ సినిమాను తలపించే విధంగా ఉత్కంఠభరితంగా ఈ పోటీలు సాగాయి. జార్ఖండ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాలకు చెందిన 25 మంది పాల్గొన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని విజయపురి జిల్లా చడ్చల్ గ్రామానికి చెందిన రామచంద్ర మొదటి స్థానంలో నిలిచారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన పీయూసీ సింగ్ రెండవ బహుమతిని దక్కించుకున్నారు. కర్ణాటక రాష్ట్రం, విజయపురి జిల్లా చడ్చల్‌కు చెందిన కామన్న మూడవ బహుమతిని కైవసం చేసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన విజయ్‌కుమార్ నాలుగవ బహుమతి పొందారు. వారికి ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో మునిసిపల్ మాజీ చైర్మన్ దేవన్న, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మధుకుమార్, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి షెక్షావలి ఆచారి చెక్కుల రూపంలో మొదటి బహుమతి రూ.50 వేలు, రెండవ బహుమతి రూ.25 వేలు, మూడవ బహుమతి రూ. 15 వేలు, నాలుగవ బహుమతి రూ.7 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ సురేష్, ఆలయ కమిటీ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

అవినీతికి అందలం

● విద్యాశాఖలో చేతివాటం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలో అవినీతి రాజ్యమేలుతోంది.. అక్రమ సంపాదనకు అలవాటు పడిన విద్యాశాఖ కార్యాలయంలో ఉద్యోగులకు నెల నెలా రూ.లక్షల జీతం వస్తున్నా అక్రమ సంపాదన కోసం చేతులు చాస్తున్నారు. ఫైల్ ముందుకు కదలాలంటే చెయ్యి తడపాల్సిందే... లేదంటే ఆ ఫైల్ ఆ సెక్షన్‌లో కనిపించదు.. మాయమైపోతుంది. లేకుంటే ఆ ఫైల్‌లో పేపర్లు సరిగాలేవు.. అందుకు తగ్గ వివరాలు లేవు అంటూ మూలన పడేస్తారు. అడిగినన్ని పైసలు ఇస్తే చాలు ఆ ఫైల్‌కు అన్నీ ఉంటాయి.. చక చక.. ఫైల్ కదిలిపోతుంది. కింది స్థాయి నుంచి అన్ని సెక్షన్ల వారిగా సంతకాలు అయిపోతాయి.. ఇదీ విద్యాశాఖలో జరుగుతున్న తంతు.

2025-26 విద్యా సంవత్సరానికి గాను మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 42 ప్రైవేట్ పాఠశాలల కోసం పలువురు నిరుద్యోగులు, ఇతరులు జిల్లా కేంద్రంతో పాటు, వివిధ మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసుకునేందుకు అన్ని వివరాలతో విద్యాశాఖ అనుమతి కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అందుకు గత జనవరి 15తో దరఖాస్తు చేసుకునేందుకు గడువు కూడా ముగిసింది, అందులో కేవలం 8 పాఠశాలల ఫైల్స్ మాత్రం పాఠశాల విద్యాశాఖ కార్యాలయానికి పంపించారు. మిగతావన్నీ దరఖాస్తులు సరిగా లేవని తిరస్కరించారు. ఇదిలా ఉంటే ఉపాధ్యాయులు డిప్యుటేషన్ రద్దు చేసేలా మండల విద్యాశాఖ అధికారులకు సర్క్యులర్ తయారు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పలుమార్లు ఆదేశించినా ఆ ఫైల్ మాత్రం ఇప్పటికీ చేయలేదు... ఎంఈవోలకు ఇవ్వలేదు.. అదేమిటంటే పని ఒత్తిడి కారణంగా పూర్తి చేయలేదు.. చేస్తాం అంటూ విద్యాశాఖ సూపరింటెండెంట్ చెపుతున్నారు. విద్యాశాఖలో డబ్బులు ఇవ్వనిదే పని జరగడం లేదని కొందరు విద్యార్థి సంఘాల నాయకులు ప్రజావాణిలో ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఫైల్ కదలికకు రూ.లక్షలు వసూలు ...

నూతనంగా ఏర్పాటు చేసే ప్రైవేట్ పాఠశాలలకు అనుమతులకు సంబంధించి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఫైల్స్ తీసుకునేందుకు నాలుగు సెక్షన్‌లు ఏర్పాటు చేశారు. మండలాల వారీగా ఈ సెక్షన్స్‌కు సంబంధించిన ఉద్యోగులు ఫైల్ తీసుకున్నారు. కొత్తగా ఏర్పాటు చేసే పాఠశాలల అనుమతి కోసం గత నెల 15 వరకు పాఠశాల విద్యాశాఖ అధికారులు దరఖాస్తులు తీసుకున్నారు. అవి సరిగా ఉన్నయా లేదా... మండల విద్యాశాఖ రిపోర్టు కూడా నిబంధనల ప్రకారం తరగతి గదులు, ఫైర్ సర్టిఫికెట్, విద్యార్థులకు వసతులు, ఉపాధ్యాయులు తదితర వసతులు ఉన్నాయా అన్న విషయాలను పూర్తి వివరాలతో మండల విద్యాశాఖ పరిశీలించిన ఫైల్స్ జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి వచ్చాయి. ఈ ఫైల్స్ విషయంలో కార్యాలయ సూపరింటెండెంట్ కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేరుగా కాకుండా మరో మధ్యవర్తులలో పాఠశాల ఏర్పాటు నిర్వాహకుల స్థాయిని బట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని, అందుకు దరఖాస్తు చేసుకున్న నిర్వాహకులే చెపుతుండటం గమనార్హం. తక్కువలో తక్కువ రూ.25 వేలు, ఎక్కువలో ఎక్కువ రూ.50 వేలు డిమాండ్ చేస్తున్నారు. తమకు తోచింది ఇస్తామంటే ఫైల్ పక్కకు పెడుతామని బాహాటంగానే చెపుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మహబూబ్‌నగర్ డీఈవో కార్యాలయం

● బాస్ ఆదేశించినా కదలని ఫైల్

నూతన పాఠశాలల అనుమతి కోసం జిల్లాలో 42 దరఖాస్తులు రాగా అందులో 8 మాత్రమే రాష్ట్ర పాఠశాల విద్యాశాఖకు పంపినట్లు విద్యాశాఖ అధికారులు చెపుతున్నారు. అందుకు సంబంధించిన పాఠశాల పేర్లు కూడా బయటకు చెప్పడం లేదు. 42 దరఖాస్తుల వివరాలు ఇవ్వడం లేదు.. కేవలం డబ్బులు ఇచ్చిన వారి ఫైల్ మాత్రమే పాఠశాల విద్యాశాఖ కార్యాలయానికి పంపినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంట్లో కీలక పాత్ర పోషిస్తున్నది డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ అని విద్యార్థి సంఘాల నాయకులు జిల్లా అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. అతన్ని పూర్తి స్థాయి విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో ఉన్న టీచర్ల డిప్యుటేషన్ రద్దుకు సంబంధించి అందరు ఎంఈవోలకు సర్క్యులర్ ఇవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశించినా ఫైల్ కదలడం లేదు. ఇప్పటికీ అందుకు సంబంధించిన సర్క్యులర్ ఇవ్వలేదు. ఇందులో కీలక పాత్ర సూపరింటెండెంట్ వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. విద్యాశాఖలో వసూల్‌రాజాగా వ్యవహరిస్తున్నారని విద్యార్థి సంఘాలు కోడై కూస్తున్నాయి.

నేటి సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

నారాయణపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం నారాయణపేటకు వస్తున్న సందర్భంగా అన్ని ఏర్పాట్లతో సర్వం సిద్ధం చేశారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి సీఎం పర్యటన ఏర్పాట్లు దగ్గరుండి అన్నీతానై మూడురోజుల నుంచి జిల్లా యంత్రాంగానికి దిశా నిర్దేశం చేస్తూ వచ్చారు. అప్పక్‌పల్లి మెడికల్ కళాశాల దగ్గర దాదాపు రూ.100 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపన శిలాఫలకాలు ఏర్పాటు చేశారు. అక్కడే జరిగే సీఎం బహిరంగ సభ వేదికను సర్వాంగ సుందరంగా ఏర్పాటు చేశారు. సభ వేదిక ఏర్పాట్లు ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి, ఈర్లపల్లి శంకర్, వంశీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ.సలీం తదితరులు పరిశీలించారు. అలాగే మల్టీజోన్-2 ఐజీపీ సత్యనారాయణ, జోగుళాంబ జోన్-7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో కలిసి ముందస్తు పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. సింగారం చౌరస్తా గురుకుల దగ్గర ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి పెట్రోల్ బంక్ వరకు అక్కడి నుంచి అప్పక్‌పల్లి మెడికల్ కాలేజీ వరకు రూట్ బందోబస్తు పరిశీలించారు. బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అప్పక్‌పల్లి శివారులో పార్కింగ్ ఏర్పాటు చేశారు.

వెయ్యిమంది పోలీసులతో బందోబస్తు

సీఎం పర్యటనకోసం వెయ్యి మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వెయ్యి మంది పోలీసులు, నారాయణపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, సంగారెడ్డి ఎస్పీలతో పాటు అదనపు ఎస్పీలు ఇద్దరు, డీఎస్పీలు ఆరుగురు, సీఐలు 28 మంది, ఎస్ఐలు 81 మంది, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు 133, పీసీలు 750, టీఎస్ఎస్ ప్లటూన్స్-4 బృందాలతో పకడ్బందీగా ఎస్పీ యోగేష్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సీఎం పర్యటన ఇలా..

ఉదయం 11:30 గంటలకు బేగంపేట ఎయిర్ పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు దూద్యాల మండలం పోలేపల్లి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ్నుంచి 12:10 నుంచి 12:25 గంటల వరకు పోలేపల్లి రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో పూజల్లో పాల్గొంటారు. 12:35కి హెల్‌ప్యాడ్‌కు చేరుకొని 12:50కి నారాయణపేట సింగారం క్రాసింగ్ గురుకుల హాస్టల్ దగ్గర ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. ఒంటి గంట నుంచి 1:15 వరకు జిల్లా మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్‌ను సింగారం చౌరస్తాలో ప్రారంభిస్తారు. కాన్వాయ్ ద్వారా అప్పక్‌పల్లికి చేరుకొని 1:20 నుంచి 1:30 వరకు అప్పక్‌పల్లి దగ్గర ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గువేసి ప్రారంభిస్తారు. 1:35 నుంచి 2 గంటల వరకు ప్రభుత్వ మెడికల్ కళాశాల, మాతా శిశు సంరక్షణ కేంద్రం, మెడికల్ విద్యార్థుల హాస్టల్ తదితర వందకోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. అనంతరం అప్పక్‌పల్లి మెడికల్ కాలేజీ దగ్గర 2:10 నుంచి 3:25 వరకు ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అధ్యక్షతన జరిగే బహిరంగ సభను ఉద్దేశించి సీఎం ప్రసంగిస్తారు. 3:25కి హెలిప్యాడ్ వద్దకు చేరుకొని 4:25కి బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు.

మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ పంపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు

నారాయణపేటటౌన్ : రాష్ట్రంలో మొట్టమొదటి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నడిచే పెట్రోల్ పంపును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి తెలిపారు. నారాయణపేట జిల్లాలోని అప్పంపల్లి దగ్గర సీఎం సభా స్థలిని ఎమ్మెల్యేలు చిట్టెం పర్ణికారెడ్డి, శ్రీహరి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. అనంతరం విలేకరులతో పర్ణికారెడ్డి మాట్లాడుతూ వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని, మహిళలకు కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తుందన్నారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ బీసీ బిడ్డగా బీసీ కులగణనను స్వాగతించి అది నెరవేర్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నమూనాకు సీఎం రేవంత్‌రెడ్డి ముగ్గు వేసి ప్రారంభిస్తారన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ఎడారిగా మారబోతున్న మక్తల్, నారాయణపేట, కొడంగల్ ప్రాంతాలకు నీరు అందించాలని కంకణం కట్టుకున్నారన్నారు. డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ విజయకుమార్, నాయకులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు మేథో సంపత్తి హక్కులు

- పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మేథో సంపత్తి హక్కులు పొంది భవిష్యత్ తరాలకు అందించాలని వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. గురువారం పీయూలోని ఫార్మసీ కళాశాల ఆడిటోరియంలో ఐక్యూ ఏసీ ఆధ్వర్యంలో ఐపీఆర్-రూల్ ఆఫ్ పేటెంట్ ఇన్ ద డిజిటల్ ఎర ఇన్నోవేషన్, చాలెంజెస్, సొల్యూషన్స్ అనే అంశంపై ఒక రోజు ఆర్గనైజేషనల్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. నూతన ఆవిష్కరణలపై మేథో సంపత్తి హక్కులు పొందిన తరువాతే వాటిని ప్రచురించాలని అన్నారు. పరిశోధనలు, అభివృద్ధిని ప్రోత్సహించటానికి మేథో సంపత్తి హక్కులు ఉపయోగపడుతాయన్నారు. అనంతరం ముఖ్య వక్త డాక్టర్ శంకర్ రావు మాట్లాడారు. ప్లేగారిజం 24.5 శాతం వరకు ఏఐ టూల్ అనుమతిస్తుందని, ఏదైనా నూతన ఆవిష్కరణలు జరిగిన వెంటనే పేటెంట్ హక్కులు పొందాలని, తద్వారా ఆ ఆవిష్కరణపై 20 సంవత్సరాలు వరకు హక్కు ఉంటుందని అన్నారు. నూతన ఆవిష్కరణపై పేటెంట్ హక్కులు ఏ విధంగా నమోదు చేయాలి, అవసరమగు డాక్యుమెంట్లు ఎలా ఉండాలి, న్యాయపరమైన ఆటంకాలు లేకుండా పేటెంట్ హక్కులు ఏవిధంగా పొందవచ్చు అనే అంశాలను వివరించారు. అనంతరం పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప మాట్లాడుతూ పీయూలో పరిశోధనలకు పెద్దపీట వేస్తున్నాయని, పరిశోధనలకు అవసరమగు సీడ్‌మని అందిస్తున్నామని అన్నారు. ఐక్యూఏసీ డైరెక్టర్ అండ్ చైర్మన్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రాజ్ కుమార్, కో కన్వీనర్ డాక్టర్ మధు, కోఆర్డినేటర్ డాక్టర్ అర్జున్ కుమార్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ డాక్టర్ కరుణాకర్ రెడ్డి, డాక్టర్ రవికాంత్,వివిధ విభాగాల అధిపతులు,డిగ్రీ,పీజీ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు

సేవాలాల్ చూపిన మార్గం ఆచరణీయం

» హింస, మత్తుకు దూరంగా ఉండాలన్న వ్యక్తి..
» మంత్రి జూపల్లి కృష్ణారావు
» కొల్లాపూర్‌లో ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి



మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ బదావత్ సంతోష్ లను సన్మానిస్తున్న గిరిజనులు

ర్యాలీలో పాల్గొన్న గిరిజనులు

కొల్లాపూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : సంత్ సేవాలాల్ మహరాజ్ చూపిన సన్మార్గాలు ప్రతీ ఒక్కరికి ఆచరణీయమని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను గురువారం జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని సేవాలాల్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా పట్టణంలోని మాధవస్వామి గుడి నుంచి ఈదమ్మ రోడ్డు మార్గం గుండా గిరిజన భవనం సభ స్థలం వరకు బైక్ ర్యాలీతో గిరిజన సాంప్రదాయ నృత్యాలతో యువతీ, యువకులతో కలిసి కలెక్టర్ బదావత్ సంతోష్ పాల్గొన్నారు. సేవాలాల్ మహరాజ్ మేరమ యాడి దేవతకు మహాభోగ్ (హోమం)లో పాల్గొన్న మంత్రి, కలెక్టర్, లంబాడి జూరారులతో కలిసి సాంప్రదాయబద్ధంగా హోమంలో నెయ్యి కడావ్ ప్రసాదం వేసి నైవేద్యం సమర్పించారు. జిల్లాలోని ప్రజలు ఆయురారోగ్యాలు, ధన ధాన్యాలతో వర్ధిల్లేలా ఆశీర్వదించాలని ప్రార్థించారు. అనంతరం జడ్పీటీసీ మాజీ సభ్యుడు హనుమంత్ నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. సేవాలాల్ అందరికీ ఆదర్శ ప్రాయుడని, జీవహింస చేయరాదని, అబద్దాలు మాట్లాడరాదని, చోరీలు చేయొద్దని, మాంసాహారం తినొద్దని బోధించారని గుర్తు చేశారు. సేవాలాల్ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. తన నియోజకవర్గంలో సేవాలాల్ ఆలయాన్ని నిర్మించేందుకు, ఇప్పుడున్న సేవాలాల్ భవన్ అన్ని వసతులతో పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతీ తండాలో గిరిజనులుసారాను తయారు చేయవద్దని, ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే సారాను దూరం చేద్దామని మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి, ఆర్డీవో భన్సీలాల్, బన్సీరామ్ నాయక్, శంకర్ నాయక్, గోవింద్ నాయక్, గోపి నాయక్, లంబాడి గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడాల్సిన జాతి మనదే : కలెక్టర్

సంత్ సేవాలాల్ తన బోధనల ద్వారా గిరిజన జాతి అభివృద్ధికి ఎంతో కృషి చేశారని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. తండాల నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. బంజారా జాతిని చీకటి నుంచి వెలుగులోకి తీసుకొచ్చిన ఒక విప్లవ చైతన్య మూర్తి అని తెలిపారు. ప్రతీ ఒక్కరు జాతి అభ్యున్నతికి కృషి చేయాలని, విద్యకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. ప్రకృతిని ప్రేమిస్తూ కాపాడాల్సిన బాధ్యత మన జాతి మీదే ఉందని కలెక్టర్ గుర్తు చేశారు.

రూ.2కోట్లకు చేరిన బకాయిలు

» పేరుకుపోతున్న మునిసిపల్ దుకాణాల అద్దెలు
» దుకాణదారులకు నోటీసులు జారీ
» సీజ్‌కు సిద్ధమవుతున్న అధికారులు




గద్వాల పట్టణంలోని ప్రధాన రోడ్డులో ఉన్న ఐడీఎస్ఎంటీ దుకాణాలు

గద్వాల టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణ మునిసిపాలిటీకి ఏటా లభించే ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటైన ఐడీఎస్ఎంటీ మునిసిపల్ దుకాణాల అద్దె బకాయిలు పేరుకుపోతున్నాయి. పలువురు యజమానులు ఏళ్ల తరబడిగా అద్దెలు చెల్లింకపోవడంతో మునిసిపల్ ఆదాయానికి భారీగా గండి పడింది. వాస్తవానికి ఏటా రావాల్సిన అద్దెల్లో 2/3 వంతు ఆదాయం బకాయి రూపంలోనే మిగిలిపోతుండటం సమస్యగా మారింది. దీని ప్రభావం పలు అభివృద్ధి కార్యక్రమాలపై స్పష్టంగా కనిపిస్తున్నా.. రాజకీయ జోక్యంతో అధికారులు మిన్నకుండిపోయే పరిస్థితి తలెత్తింది. మునిసిపల్ కౌన్సిల్ పాలన గడువు ముగిసి ఇటీవలే కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పాలన అధికారి బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఇప్పటికైనా అద్దె బకాయి వసూలుపై దృష్టి సారించాల్సి ఉంది.

రూ.2 కోట్లకు చేరిన బకాయిలు

పట్టణ పరిధిలో పలు బ్లాక్‌ల వారీగా మొత్తం 333 దుకాణాలు ఉండగా వాటి ద్వారా ఏటా రూ.2.79కోట్ల వరకు అద్దె వసూలు కావాల్సి ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ.1.76 కోట్ల వరకు ఏరియర్స్ రూపంలో బకాయిగా మిగిలింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కరెంట్ డిమాండ్ (నడుస్తున్న ఆర్థిక సంవత్సరం) రూ.2,79,04,191 కాగా రూ.1,76,15,900 ఏరియర్స్ రూపంలో ఉన్నవి కలిపి మొత్తం రూ.4,55,20,091 వసూలు చేయాల్సి ఉంది. ఇందులో ఇప్పటి వరకు కేవలం రూ.1.65కోట్ల మేరకు మాత్రమే వసూలు కాగా, మిగతా సొమ్ము వసూలు కోసం బిల్ కలెక్టర్లు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి తలెత్తింది. గత నెలలో ప్రభుత్వం చేపట్టిన కులగణన కార్యక్రమంలో పట్టణ మునిసిపాలిటీలోని అన్ని విభాగాల్లో పని చేసే సిబ్బందిని వినియోగించుకోగా దాదాపు నెలరోజుల పాటు ఆస్తి పన్ను వసూలు నిలిచిపోయింది. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మిగిలిన 40 రోజుల్లోగా దాదాపు రూ.3 కోట్ల వరకు దుకాణాల అద్దె వసూళ్లు చేసేలా సిబ్బందిపై ఒత్తిడి పెరిగింది.

చట్టపరంగా చర్యలు



అద్దె బకాయిలు చెల్లించాల్సిన దుకాణదారులకు నోటీసులు జారీ చేశాం. మూడు నెలలకు మించి, రెండేళ్లకు పైగా బకాయిలు ఉన్న దుకాణాలు ఉన్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరలోనే వీరికి తుది నోటీసులు ఇచ్చి దుకాణాలకు తాళం వేయాల్సి ఉంటుంది. అలాంటి పరిస్థితి తలెత్తకుండా దుకాణదారులు అద్దెలు చెల్లించి మునిసి పాలిటీకి సహకరించాలి.

- దశరథ్, మునిసిపల్ కమిషనర్, గద్వాల

నోటీసులకు స్పందన కరువు

అద్దె బకాయిల వసూలు కోసం మునిసిపల్ అధికారులు ఇప్పటికే దుకాణదారులకు నోటీసులు జారీచేసినా స్పందన అంతంతగానే ఉన్నట్లు బిల్ కలెక్టర్లు వాపోతున్నారు. పాత బస్టాండ్, కూరగాయల మార్కెట్ పరిసరాల్లోని ప్రధాన రోడ్లపై ఉన్న దుకాణదారుల్లో కొంత మంది రూ.5లక్షలు మొదలుకుని రూ.20లక్షలకు పైగా అద్దెను పెండింగ్‌లో ఉంచారు. ఆయా దుకాణాల్లో ఉంటున్న వారికి ఇప్పటికే మూడు సార్లు నోటీసులు జారీచేసిన అధికారులు చివరిసారిగా 48 గంటల గడువుతో నోటీసు లు జారీచేసి ఆలోగా వసూలు జరగకపోతే దుకాణాలను సీజ్ చేసేందుకు సిద్ధపడుతున్నారు.

శివనామస్మరణతో మార్మోగుతున్న నల్లమల



వటువర్లపల్లిలో మాలధారులకు పండ్లు పంపిణీ చేస్తున్న స్థానికులు



శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న శివమాలధారులు

దోమలపెంట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నల్లమల కొండల్లో కొలువుదీరిన శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు భక్తులు శ్రీశైలానికి తండోప తండాలుగా తరలివస్తున్నారు. రాష్ట్రం నలు మూలల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు, కొందరు శివమాలతో, మరి కొంత మంది పాదయాత్రగా వెళ్తున్నారు. వారం రోజుల నుంచి నల్లమల ప్రాంతం శివనామస్మరణతో మార్మోగుతోంది. పాదయాత్ర చేసే భక్తులతో శ్రీశైలం - హైదరాబాద్ ప్రధాన రహదారి రద్దీగా మారింది. ముఖ్యంగా మన్ననూర్, వటువర్ల పల్లి, దోమలపెంట, పాతాళగంగ గ్రామాలలో భక్తుల సందడి కనిపిస్తున్నది. వ్యాపారాలు కూడా బాగా సాగుతున్నాయి. భక్తులకు ఆకలి, దప్పికలు తీర్చేందుకు దాతలు అన్నదానం చేస్తుండగా, అచ్చంపేట వారు శివ సన్నిధి సేవా సమితి ఆధ్వర్యంలో పండ్లు, తాగునీరు అందిస్తున్నారు.

నిలిచిన కులాంతర వివాహ ప్రోత్సాహకం

» జోగుళాంబ గద్వాల జిల్లాలో 2021 నుంచి 52 దరఖాస్తులు పెండింగ్
» ఎదురుచూస్తున్న జంటలు

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో కులాంతర వివాహం చేసుకున్న జంటలు ప్రోత్సాహకాలకై ఎదురుచూస్తున్నారు. పెళ్లి అయిన కొద్ది నెలలకే తమకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం అందుతుందని, దీంతో తమ కుటుంబం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటాయనుకున్న తరుణంలో పిల్లలు పుట్టి, వారు నడుస్తున్నా కూడా ప్రభుత్వం తమను ఎందుకు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లు గడిచాక ఇటీవలే కేవలం ఒకే ఒక జంటకు అది కూడా ఇద్దరు పిల్లలు అయ్యాక ఇవ్వడంతో.. ఇక మా పిల్లలు ఎంతపెద్దయ్యాక ఇస్తారేమోనని లబ్ధిదారులు విమర్శిస్తున్నారు.

52 దరఖాస్తులు పెండింగ్‌లో..

జోగుళాంబ గద్వాల జిల్లాలో 2021 నుంచి కులాంతర వివాహాలు చేసుకున్న 52 మంది జంటలకు ప్రోత్సాహకాలు అందలేదు. ఇటీవలే కేవలం ఒకే ఒక జంటకు పది రోజుల క్రితం రూ.2.50 లక్షలు అందాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు ప్రోత్సాహకాలు అందేలా చూడాలని కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులు కోరుతున్నారు.

బడ్జెట్ లేకపోవడంతోనే ఆలస్యం



కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు బడ్జెట్ లేకపోవడం వల్లనే ప్రోత్సాహకాలు రాలేదు. ప్రభుత్వం నుంచి బడ్జెట్ వస్తే, పెండింగ్‌లో ఉన్న అందరికి అందేలా చూస్తాం. 2021 నుంచి బడ్జెట్ సమస్య ఇందుకు కారణం.

- సరోజ, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి, గద్వాల

మైనింగ్ ఆపి.. గ్రామాన్ని కాపాడండి



ముఖ్యమంత్రికి పంపే పోస్టుకార్డులు చూయిస్తున్న గ్రామస్థులు

బల్మూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం మైలారం గ్రామానికి ఆనుకుని ఉన్న గుట్టను మైనింగ్ ద్వారా కాంట్రాక్టర్ తవ్వకాలు చేపడుతున్నారని, వాటిని ఆపాలని గురువారం గ్రామస్థులు పోస్టు కార్డు ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వారు సీఎంకు పంపిస్తున్న పోస్టుకార్డులను ప్రదర్శించారు. గుట్టను ఆనుకుని ఉన్న గ్రామాన్ని విధ్వంసం చేసే ప్రక్రియ మొదలైందని, సమీపంలో పొలాలు ఉన్నాయని, గ్రామంలో మైనింగ్ శబ్దాలకు పిల్లలు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్పందించి, ప్రజలకు హాని కలిగించే విధానాన్ని రూపుమాపి బాధలను అర్థం చేసుకుంటారని కోరుతున్నామని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మైనింగ్ పరిరక్షణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, దేవస్వామి, లింగయ్యగౌడ్, కోశాధికారి అనిల్, సత్య నారాయణగౌడ్, పర్వతాలు, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉద్యమ తరహాలో తెలుగుభాష పరిరక్షణ



(5వ పేజీ తరువాయి)

పూనుకోవడం శుభపరిణామమని పేర్కొన్నారు. విద్యాబోధన ఉన్నత వర్గాలకు పరిమితం కావడం కారణంగానే మాతృభాష వెనుకబాటుకు గురైందన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు వంకేశ్వరం నిరంజన్ మాట్లాడుతూ పాలక వర్గాలకే మాతృభాషను జనాలకు దూరం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు, కోర్టు తీర్పులు కూడా తెలుగులో వస్తేనే భాష ప్రాధాన్యం అందరికీ తెలుస్తుందన్నారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు దొడ్ల నారాయణరెడ్డి ప్రసంగిస్తూ కేవలం ఆదాయ ఆర్జన ధ్యేయంగానే మాతృభాషను పరిగణనలోకి తీసుకోకుండా తల్లిదండ్రులు ఆంగ్లం వైపు తమ పిల్లలను మళ్లిస్తున్నారని.. ఇది మంచి సాంప్రదాయం కాదన్నారు. తపస్ జిల్లా అధ్యక్షుడు దెంది రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ మాతృభాషలో పరిజ్ఞానం పొంది గ్లోబల్ పరిజ్ఞానం పొందాలని అభిలాషించగా డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ పాలకులు బలవంతంగా ఒక భాషను ప్రజలపై రుద్దడం సహేతుకం కాదన్నారు. కవి కాశన్న ప్రసంగిస్తూ పాలక ప్రభుత్వాలు మాతృభాష అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలన్నారు. మాతృభాష అస్తిత్వాన్ని కాపాడడానికి అన్ని వర్గాలు మమేకం కావాలని కవి వనపట్ల సుబ్బయ్య పేర్కొన్నారు. మాతృభాషలో సివిల్ సర్వీసెస్‌తో సహా అన్ని పరీక్షలు నిర్వహించాలని అరుణ్‌కుమార్ తెలియజేశారు. పల్లె భాష బతకాలంటే వివిధ వృత్తుల్లో కొనసాగుతున్న వారంతా తెలుగు ప్రాధాన్యతను అన్ని వర్గాల ప్రజలకు వివరించాలని కవి గాయకుడు కాశీదాసు పిలుపునిచ్చారు. విద్యతోనే మాతృభాష అభివృద్ధి సాధ్యమని హిద్రీస్ పేర్కొనగా తెలుగు భాష మనుగడ కొనసాగాలంటే ఇంటర్ వరకు మాతృభాషను అన్ని సబ్జెక్టుల్లో చేర్చాలని హెచ్.రమేష్‌బాబు కోరారు. చివరగా మాట్లాడిన గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్ కవులు, కళాకారుల రచనలు స్థానికంగా వారు చేసిన సాహిత్య సేవకు సంబంధించిన అంశాలన్నింటినీ జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో పుస్తక రూపంలో భద్రపర్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సమావేశంలో వాగ్గేయకారుడు, ఉపాధ్యాయుడు రాజా రాంప్రకాశ్, ఉపాధ్యాయుడు కవి వహీద్దీన్, కళాకారుడు విజయ్ కాంత్, సెంట్రల్ యూనివర్సిటీ భాషా పరిశోధన విద్యార్థి నరేష్, కవి కర్నాటి రఘురాములు గౌడ్, కవి, రచయిత గుడిపల్లి నరసింహ రెడ్డి, ఆంధ్రజ్యోతి పాత్రికేయులు జిల్లా స్టాపర్ అబ్దుల్లాఖాన్, సాజీద్, పృథ్వీరాజు, రాజేందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

నలిగిపోతున్న తెలుగు భాష



అంగ్లభాష అధిపత్యంలో తెలుగు బాష నలిగిపోతోంది, నష్టపోతుందనేది సహేతుకమే. ఏ భాష ఆధిపత్యమూ మాతృభాషపై పడకుండా ఆయా జాతులు, తెగలు వినియోగిస్తుండాలి. ధనవంతులు, పాశ్చాత్య దేశాల వారిని అనుసరిస్తూ మాతృబాషను నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో రోజురోజుకూ మాతృభాష వాడకం తగ్గిపోతోంది. ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్స్, తదితర పోటీ పరీక్షలన్నింటినీ మాతృ భాషలోనే నిర్వహించాలి.

- గుడిపల్లి నిరంజన్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కవి

మాతృ భాష అర్థవంతం



మాతృభాష అర్థవంతమైనది. మాతృభాషలో నేర్చుకునే ప్రతీ విషయం జీవితాంతం గుర్తుంటుంది. పెంపుడు తల్లులు ఎందరున్నా, కన్నతల్లి ఒక్కరే ఉన్నట్లు మాతృభాష కూడా ఒక్కటే ఉంటుంది. మాతృభాషలో ప్రావీణ్యం ఉంటే ఇతర భాషల్లో ప్రజ్ఞ సంపాదించవచ్చు. మనో భావాలను వ్యక్తం చేయడం, అర్థం చేసుకోవడం సులభం. అన్ని రంగాల్లో కచ్చితంగా వినియోగించేలా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలి.

- జి.యశోదారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయురాలు

మాతృభాష ఉనికితోనే జాతి మనుగడ



జాతి మనుగడ మాతృబాష ఉనికితోనే సాధ్యమవుతుంది. మాతృభాష ఒక జాతికి గుర్తింపు, భౌగోళిక గుర్తింపు తీసుకొస్తుంది. తమిళులు, జర్మన్‌ల వలె మాతృభాషపై అభిమానాన్ని పెంపొందించుకోవాలి. అప్పుడే అమ్మభాషను కాపాడుకోవచ్చు. విద్యాబోధన ఆంగ్లంలో సాగినా, ప్రాథమిక విద్య మాతృభాషలో సాగితే చిన్నారుల్లో విషయ పరిజ్ఞానం, వ్యవహారిక నైపుణ్యం పెంపొందుతాయి.

- డాక్టర్ శ్రీధర్ శర్మ, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

మాతృభాష వెనుకబాటు



విద్యాబోధన ఉన్నత వర్గాలకే దక్కడం వల్లే మాతృభాష వెనుకబాటుకు గురయ్యింది. విద్యావకాశాలు లేని రోజుల్లో నాటకాలు వేసేవారు, వివిధ రంగాల కళాకారులు, జాతులు మాతృభాషను మౌఖికంగా కాపాడుకుంటూ వచ్చారు. భారత దేశంలో భాష, విద్య కొన్ని వర్గాలకే పరిమితం కావాలనే ఫిలాసఫీ ఉండడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. అన్ని వర్గాలకు మాతృభాషలోనే విద్య బోధన అందించాలి. అప్పుడే భాషాభివృద్ధి సాధ్యం అవుతుంది.

- సి. భాస్కర్ రావు, విశ్రాంత ప్రిన్సిపాల్, పాలిటెక్నిక్ కళాశాల

మాతృభాషలో కోర్టు తీర్పులు



మాతృభాషను కాపాడుకోవాలంటే ప్రభుత్వ ఉత్తర్వులు, కోర్టు తీర్పులు, ఇతర నియమ నిబంధనలన్నీ మాతృభాషలోనే ఉండాలి. ఇంటర్మీడియట్ వరకు మాతృభాషలోనే విద్య బోధన సాగాలి. మాతృభాషలో విషయం అర్థమైనంత సరళంగా ఇతర బాషల్లో కాదు. అంగ్లంలో ఉన్నత విద్యాభ్యాసం చేసిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, నిజ జీవితంలో చాలా వరకు విషయాలను లోతుగా అర్థం చేసుకోలేక ఒత్తిడికి గురవుతున్నారు. మాతృభాషతో పాటు అవసరమైన ఇతర బాషలను నేర్చుకోవాలి.

- వంకేశ్వరం నిరంజన్, విశ్రాంత ఉపాధ్యాయుడు, కవి, రచయిత

పరభాష మోజులో విద్యా సంస్థలు



ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు ఆంగ్ల భాష మోజుతో బోధన సాగిస్తుండడంతోనే మాతృభాష ప్రమాదంలోకి నెట్టబడింది. మాతృభాష అయిన తెలుగును నేర్చుకోవడం కష్టంగా ఉంటుంది. ఆంగ్ల భాష చాలా సులభంగా ఉండడం, ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ వినియోగంలో ఉండడంతో మాతృభాషను విస్మరిస్తున్నాం. మాతృభాషలో విద్యార్జన చేస్తే ఎంతో జ్ఞానాన్ని సంపాదించవచ్చు. ప్రపంచ దేశాల్లోని మేధావులంతా మాతృభాషలో చదువుకున్న వారేనని ఈ తరానికి వివరించాలి.

- దొడ్ల నారాయణ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ ఉమ్మడి సలహాదారుడు

మాతృభాషలో మమేకం కావాలి



మాతృభాషలో మమేకం అవుతూనే గ్లోబల్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. ప్రాథమిక స్థాయిలో విద్యా బోధనను మాతృభాషలో సాగిస్తేనే నైపుణ్యాభివృద్ధి సాధ్యమని కేంద్ర ప్రభుత్వ నూతన విద్యా విధానం పేర్కొనడం అభినందనీయం. ఆంగ్ల మాధ్యమంలో చదివిన వారిని, మాట్లాడిన వారిని చూసినప్పుడు మనల్ని మనం తక్కువగా భావించడం కూడా ఒక కారణం. భారతదేశంలో వేల భాషలు, భిన్న సంస్కృతులు ఉండడం వల్ల కొంత విద్యాబోధన ఇబ్బందిగా మారింది.

- రాజారెడ్డి, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం

స్పష్టమైన భావనలు వ్యక్తం చేయగలం



మాతృభాష, వ్యవహారిక భాషలోనే స్పష్టమైన భావనలను వ్యక్తం చేయగలం. పాలకుల భాషను ప్రజలపై బలవంతంగా రుద్దడంతోనే మాతృభాష మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. అతి పురాతనమైన బొమ్మల లిపిని కాపాడుకుంటూ వస్తున్న చైనా దాని ఉనికిని ప్రపంచానికి చాటుతోంది. ప్రపంచంలో ఎక్కువగా వినియోగిస్తున్న ఆంగ్ల భాషను మాతృభాషగా ఈతరం పిల్లలు భ్రమ పడుతున్నారు. లిపిలేని మాతృభాషల అభివృద్ధికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

- లక్ష్మణ్ నాయక్, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్

ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యం



మాతృభాషలో చదివిన వారికే ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం కల్పించాలి. అప్పుడే భాషాభివృద్ధి సాధ్యమవుతుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వాలు భాషాభివృద్ధికి కార్యచరణ రూపొందించి అమలు చేయాలి. ప్రపంచంలో సుందరమైన రెండవ భాషగా తెలుగు కీర్తించబడింది. ఇంతటి గొప్ప భాషను మనమే అవమానకరంగా నిర్లక్ష్యం చేస్తున్నాం. ఇప్పటికైనా పిల్లలకు మాతృభాషలోనే ప్రాథమిక విద్య బోధించాలి. భాషా పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

- కాశన్న, కవి, నాగర్‌కర్నూల్

అస్తిత్వాన్ని కాపాడుకోవాలి



కమ్మనైన మాతృభాషను విద్యా వ్యవస్థలో వినియోగిస్తూ అస్థిత్వాన్ని కాపాడుకోవాలి. మాతృభాషను పురిటిలోనే చంపేస్తున్నాం. అమ్మ, నాన్నలకు బదులుగా మమ్మీ, డాడీలుగా పిలిచినంత సులభంగా మాతృభాషను మార్చారు. మాతృభాష అంతరిస్తే జాతులు కనమరుగయ్యే ప్రమాదం ఉంది. సమాజంలో భాషా వినియోగం పెరిగినప్పుడే ఆ జాతి ప్రభావం, విలువ పెరుగుతుంది. మాతృభాషను నిర్లక్ష్యం చేయడం మనల్ని మనమే అవమాన పర్చుకోవడమే. మాతృభాష ప్రాముఖ్యతను ముందు తరాలకు అందించడం పెద్దలందరిపై ఉంది.

- వనపట్ల సుబ్బయ్య, కవి, రచయిత

సంస్కృతి, సంప్రదాయాలు తెలుస్తాయి



ఒక ప్రాంత ప్రజల సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయాలు మాతృభాషతోనే తెలుస్తాయి. కోయలు, చెంచులు, లంబాడాల మాతృభాషలకు లిపి లేకపోయినా వారి పూర్వీకుల నుంచి వచ్చిన భాషా జ్ఞానాన్ని భవిష్యత్తు తరాలకు అందిస్తున్నారు. అట్టడుగు వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే మాతృభాషలో పోటీ పరీక్షలు నిర్వహించాలి. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలంటే మాతృభాషతో పాటు ప్రపంచ భాషల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి. తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలి.

- అరుణ్ కుమార్, కవి, ఫిజిక్స్ లెక్చరర్

మాతృభాషలోనే విద్యాబోధన



ఇంటర్ వరకు మాతృభాషలో విద్యబోధనను ప్రవేశపెట్టాలి. ఆంగ్లేయులు వారికి అర్థమయ్యేందుకు వారి మాతృభాషలో ఉత్తర్వులు, తీర్పులు ప్రవేశపెట్టారు. వారి భాషను మనపై బలవంతంగా రుద్దారు. ఇప్పటికీ మనం అదే భాషపై మోజు పెంచుకొని అమ్మభాషను దూరం చేసుకుంటున్నాం. నిజాం పాలన ముగిసిన తర్వాత పాలెంలో సుబ్బయ్య స్థాపించిన ప్రాచ్య కళాశాలలో చదివిన ఎందరో ముస్లింలు తెలుగు భాషా కవులుగా ప్రసిద్ధి చెందారు. తెలుగు భాషా ఔన్నత్యాన్ని చాటిచెప్పిన పీవీ నరసింహారావు, వెంకయ్యనాయుడుల స్ఫూర్తితో మాతృభాష అభివృద్ధికి పాటుపడాలి.

- హెచ్.రమేశ్‌బాబు, కవి, రచయిత

పల్లె భాష బతకాలి



పల్లె భాష బతకాలి. పల్లెల్లో మాట్లాడే మూలవాసుల మాతృభాష మాతృత్వంలో నుంచి వచ్చింది. తల్లి గర్భంలో ఉన్నప్పుడే నేర్చుకున్న భాషలో విద్యా బోధన జరగకపోవడంతో పెద్ద ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తున్న వారు సైతం పరభాషను సంపూర్ణంగా అర్థం చేసుకోలేకపోతున్నారు. దీంతో మానసిక ఒత్తిడికిలోనై ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లోని మాండలికల్లో, వాడుక భాషలో విద్యాబోధన సాగిస్తేనే సామాన్యులు సైతం నైపుణ్యాభివృద్ధి పొందుతారు. అప్పుడే మాతృభాష విరాజిల్లుతుంది.

- కాశీదాసు, కవి, గాయకుడు, పాలెం

విద్యతోనే మాతృభాష అభివృద్ధి



భారతదేశంలో వివిధ మతాలు, కులాలు, భాషలు, ఆహార్యాలు, పద్ధతులు ఉన్నా, విద్యతోనే మాతృభాష అభివృద్ధి సాధ్యమవుతుంది. నేటి బాలలు రేపటి పౌరులుగా ఎదగాలంటే ప్రాముఖ్యమైన అంశాల బోధన చేపట్టాలి. ప్రభుత్వాలు భాషా పండితులను నియమించి బోధన సాగిస్తే ఆయా ప్రాంతాల్లోని మాతృభాష అభివృద్ధికి పాటు పడవచ్చు. సామాజిక మాధ్యమాల్లోనూ మాతృభాషలను వినియోగించాలి. పత్రికల ద్వారా కూడా ప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చి మాతృభాష అవశ్యకతను తెలపాలి.

- ఇద్రిస్, కవి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

విజ్ఞానవంతులుగా రాణింపు



మాతృభాషలో చదువుకున్న వారు విజ్ఞానవంతులుగా రాణిస్తున్నారు. మా సొంత అన్న కూతురు తెలుగు మీడియంలో చదువుకొని జర్మనీలో ఉన్నత స్థాయిలో పేరు ప్రఖ్యాతులను సంపాదించుకున్నది. ప్రస్తుతం సమాజ పోకడలను చూసి పేద ప్రజలు కూడా ఆంగ్ల మాధ్యమంలో వేలకు వేలు ఖర్చు చేసి పిల్లలను చదివిస్తున్నారు. ఆ భాష వారికి అర్థం కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రపంచంలోని ఇతర భాషా సాహిత్యాన్ని మాతృభాషలోకి అనువదించి అందరికీ అందుబాటులోకి తేవాలి.

- రాజేందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, నాగర్‌కర్నూల్

బహుముఖ ప్రజ్ఞాశాలి వేదార్థం

మాతృ భాషా సేవే పరమార్థం

» తెలుగు భారతి ఏర్పాటుతో సాహిత్యాభివృద్ధికి కృషి



అప్పటి తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి కే బాలాచారి, రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు, రిటైర్డ్ ఐఏఎస్ కెవి రమణాచారి నుంచి సత్కారం పొందుతున్న వేదార్థం మధుసూదనశర్మ (ఫైల్)

కొల్లాపూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషోపాధ్యాయుడిగా, కవిగా, రచయితగా, విమర్శకుడిగా, ఆకాశవాణి ద్వారా ప్రసంగికుడిగా, సాహితీ సంస్థ నిర్వాహకుడిగా బహుముఖ ప్రజ్ఞా పాటవాలతో తెలుగు భాషా సేవకుడిగా ముందుకు సాగుతున్నారు వేదార్థం మధుసూదనశర్మ. కొల్లాపూర్ మండలం, యన్మన్‌బెట్ల గ్రామానికి చెందిన దివంగత వేదార్థం శేషాచార్యులు, సుగుణమ్మ దంపతుల కుమారుడైన ఈయన ప్రస్తుతం కొల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

సాహితీ సాంస్కృతిక సంస్థ ఏర్పాటు

మధుసూదనశర్మ తన మిత్రుడు ఆమని కృష్ణతో కలిసి 2010లో తెలుగు భారతి పేర సాహితీ సాంస్కృతిక సంస్థను ప్రారంభించి, సాహిత్యా భివృద్ధికి కృషి చేస్తున్నారు. వేదార్థం రాసిన సాహిత్య ఆధ్యాత్మిక అంశాలతో కూడిన వందలాది వ్యాసాలు, సామాజిక అంశాలపై కవితలు వివిధ దిన, పక్ష, మాస, పత్రికలలో ప్రచురితమయ్యాయి. ఆకాశవాణి, దూరదర్శన్‌లలో కూడా ప్రసారం అయ్యాయి. అడుగు జాడలు, సాహితీ ముత్యాలు, కొల్లాపూర్ సాహితీ వైభవం, కృష్ణా పుష్కర శోభ, సమాలోకనం, పరంపర, అక్షర శిల్పులు తదితర పుస్తకాలను టీటీడీ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తదితర సంస్థల సౌజన్యంతో ముద్రించారు. అవి భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుతో పాటు పలు వురు ప్రముఖుల ప్రశంసలను సైతం అందుకున్నాయి. అలాగే ఆకాశ వాణి హైదరాబాద్ కేంద్రం ద్వారా పలుమార్లు ప్రసంగించారు.

సాహితీ సేవలకు గుర్తింపు

కవిగా, రచయితగా, తెలుగు పండితుడిగా, ఆకాశవాణి ప్రసంగికుడిగా, తెలుగు భారతి సంస్థ ప్రధాన కార్యదర్శిగా ఆయన చేసిన విశేషమైన సేవలకు ప్రభుత్వం నుంచే కాకుండా పలు సాహితీ, సాంస్కృతిక సంస్థలు అనేక పురస్కారాలు లభించాయి. జిల్లా విద్యాశాఖ వారిచే ఉత్తమ ఉపా ధ్యాయుడిగా పురస్కారం అందుకున్నారు. తెలుగు సాహిత్య పీఠం, మనం ఫౌండేషన్, రైట్‌వే సంస్థల నుంచి పురస్కారాలు అందుకున్నారు. గురజాడ ఫౌండేషన్ (అమెరికా)వారి జాతీయ పురస్కారం, అక్షర కౌముది (హైదరాబాద్) వారిచే డా.సి.నారాయణరెడ్డి స్మారక పురస్కారం, శ్రీకరి ఫౌండేషన్ (మహబూబ్‌నగర్) వారిచే స్ఫూర్తి రత్న పురస్కారాలు అందుకున్నారు.



దూరదర్శన్ విశ్రాంత అధికారులు ఓలేటి పార్వతీశం, హనుమంత రావు, సినీ నటుడు జెన్నీలతో సత్కారం పొందుతున్న వేదార్థం (ఫైల్)

పండితపురం అనంతవరం

» తెలుగు భాషపై గ్రామ యువత మక్కువ » 43 మంది జిల్లాలోని వివిధ కళాశాలలు, పాఠశాలల్లో కొలువు

» వారిలో 16 మంది తెలుగు ప్రభుత్వ ఉపాధ్యాయులు

బల్మూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం ప్రతీ ఒక్కరు ఆంగ్ల విద్యపై ఆసక్తి చూపుతున్న తరుణంలో, తెలుగు భాషనే నమ్ముకుని తమ జీవితాల్లో వెలుగులు నింపుకుంటున్నారు అనంతవరం గ్రామ యువతీ యువకులు. వారి మాతృభాషాభిమానం ఆ గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. నాగర్‌కర్నూల్ జిల్లా, బల్మూరు మండలంలోని ఈ గ్రామానికి చెందిన యువతీ యువకులు తెలుగు పండితులుగా రాణిస్తున్నారు. మొత్తం 43 మంది పలు పాఠశాలలు, కళాశాలల్లో తెలుగు పండితులుగా పని చేస్తున్నారు. వారిలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వారు 16 మంది ఉన్నారు. 2008లో నిర్వహించిన డీఎస్సీలో గ్రామానికి చెందిన 22 మంది తెలుగు పండిట్ పరీక్షకు హాజరు కాగా, గాయత్రి, కోటయ్య, శేఖరయ్య, రవి, సైదులు, లక్ష్మీప్రీతిలకు ఉద్యోగాలు వచ్చాయి.

అధ్యాపకుల ప్రోత్సాహం

గ్రామానికి చెందిన మల్లెకేడి రామోజీ 1989-90లో పాలెం ఓరియంటల్ కళాశాలలో తెలుగులో ప్రీ డిగ్రీ కోర్సులో చేరారు. అక్కడి వాతావరణం, అధ్యాపకుల ఆదరణ, తెలుగు భాషా బోధన నచ్చడంతో మరుసటి ఏడాది మరో ఇద్దరు విద్యార్థులను కళాశాలలో చేరేలా ప్రోత్సహించారు. ఇలా ప్రతీ ఏటా గ్రామానికి చెందిన యువతీ యువకులు తెలుగు పండిట్ కోర్సులో చేరుతూ వచ్చారు. వారికి కళాశాల అధ్యాపకులు రామకృష్ణ శాస్త్రి, మోహన్‌రెడ్డి, రంగాచార్యులు చేయూత అందించారు. వారి ప్రోత్సాహంతో సాహిత్య క్విజ్, పద్య పఠనం, ఉపన్యాసం, వ్యాసరచన పోటీల్లో పలుమార్లు బహుమతులు సాధించారు. కవులు, రచయితలుగా ప్రశంసలు అందుకుంటున్నారు. గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం శతజయంతి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గ్రామానికి చెందిన యువకుడు మల్లెకేడి రామోజీ ప్రథమ బహుమతి సాధించారు. మహబూబ్‌నగర్ పట్టణంలో 2005లో నిర్వహించిన అవధాని మాడుగుల నాగమణిశర్మ శతావధానంలో రామోజీతో పాటు శ్రీనివాసులు, నారాయణ, సీనయ్య పృచ్ఛకులుగా వ్యవహరించి సాహితీవేత్తల ప్రశంసలు అందుకున్నారు.

మాతృభాషపై అభిమానం



తెలుగు భాషపై అభిమానంతో చదువుకొని 1994 డీఎస్సీలో తెలుగు పండిట్‌గా ఉద్యోగం పొందాను. ప్రస్తుతం వెల్టూరులో విధులు నిర్వహిస్తున్నాను. తెలుగు భాషా పరిరక్షణ సమితిని ఏర్పాటు చేసి తెలుగు భాషాభివృద్ధి కృషి చేస్తున్నాం.

- అవుల శ్రీనివాసులు, తెలుగు పండిత్

తెలుగుపై మక్కువతో ఉపాధి



తెలుగుపై నాకున్న మక్కువ నేడు ప్రభుత్వ ఉద్యోగం సాధించిపెట్టింది. తెలుగు భాష మా జీవితాలను మార్చింది. అందుకే విద్యార్థులకు తెలుగు బోధించేటప్పుడు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. ఉపాధి లభిస్తుందని చెప్తున్నాం.

- గాయత్రి, తెలుగు ఉపాధ్యాయురాలు

సోషల్ మీడియాలో మక్తల్ ఎమ్మెల్యేపై ఆరోపణలు

» ఓర్వలేకే పుకార్లు : వాకిటి శ్రీహరి

» చర్చకు సిద్ధమని సవాల్

మక్తల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిపై సోషల్ మీడియాలో పలు ఆరోపణలు వెల్లువెత్తడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. మూడు రోజుల క్రితం ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలో ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తూ, కాంగ్రెస్‌ను కాపాడాలంటూ రాసిన లేఖలు వైరల్ కావడం దుమారానికి దారితీసింది. ఆరు నెలల క్రితం కూడా ఇదే తరహాలో ఆరోపణలు వచ్చాయి. ఈ విషయంపై ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా తాను ఎలాంటి అవినీతి అక్రమాలకూ పాల్పడలేదని స్పష్టం చేశారు. గిట్టనివారు పని గట్టుకొని పుకార్లు సృష్టిస్తున్నారన్నారు. బీసీ సామాజిక వ్యక్తి ఎదుగుదలను చూసి ఓర్వలేనివారు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. తన పాలనలో అక్రమాలకు తావులేదన్నారు. ఓర్వలేనివారు ఎన్ని లేఖలు రాసినా పట్టించుకోనని, అవినీతిపై చర్చకు ఎక్కడైనా, ఎప్పుడైనా తాను సిద్ధమని సవాలు విసిరారు.

వాహనం ఢీకొని మహిళ మృతి



తిరుపతమ్మ (ఫైల్)

పెబ్బేరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రంగాపురం జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న ఓ మహిళను కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా, పెబ్బేరు మండలం రంగాపురం గ్రామానికి చెందిన బాపనపల్లి తిరుపతమ్మ(50) వీపనగండ్ల మండలం పుల్గర్‌చర్ల గ్రామంలో శివస్వాముల ఇరుముడి కార్యక్రమానికి వెళ్లి గురువారం రాత్రి తిరుగుప్రయాణమయ్యింది. రంగాపురం స్టేజీ వద్ద బస్సు దిగి రోడ్డు దాటుతుండగా, ఎర్రవల్లి నుంచి పెబ్బేరుకు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

బాలుడితో వెట్టి చాకిరి - ఇద్దరిపై కేసు నమోదు

ఉప్పునుంతల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : బాలుడిని పనిలో పెట్టుకున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, ఉప్పునుంతల మండల పరిధిలోని పిరట్వానిపల్లి గ్రామానికి చెందిన పెంటయ్య, శ్రీనయ్యలు 13 ఏళ్ల బాలుడిని గొర్రెల కాపరిగా పెట్టుకున్నారు. జీతం కూడా ఇవ్వకుండా పనిచేయించుకుంటున్న విషయాన్ని గుర్తించిన స్వచ్ఛంద సంస్థ సభ్యులు తహసీల్దార్ ప్రమీలకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశం మేరకు ఈ నెల 18న ఆర్ఐ సుజాత పిర్వాటోనిపల్లి గ్రామానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. బాలుడిని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ కార్యాలయానికి అప్పగించారు. ఆర్ఐ ఫిర్యాదు మేరకు ఇద్దరు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సౌత్‌జోన్ టోర్నీలో సత్తాచాటాలి

» పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప

» ఉత్సాహంగా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక



క్రీడాకారులతో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప, పీడీ శ్రీనివాస్ తదితరులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్/పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : సౌత్‌జోన్ హ్యాండ్‌బాల్ టోర్నీలో పాలమూరు యూనివర్సిటీ జట్టు సత్తా చాటాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప అన్నారు. తమిళనాడు రాష్ట్రంలోని పెరియార్ యూనవర్సిటీలో ఈ నెల 28 నుంచి మార్చి 4వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్ యూనివర్సిటీ టోర్నీలో పాల్గొనే పీయూ పురుషుల జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నీ ప్రతిభ చాటి జాతీయ జట్టుకు ఎంపిక కావాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాస్, సత్యభాస్కర్‌రెడ్డి, యుగేందర్, వెంకట్‌రెడ్డి, కోచ్‌లు జీయావుద్దీన్, అహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు. పీయూ పురుషుల జట్టులో ప్రణయ్‌కుమార్, జాన్‌పాల్, నరేష్‌పవర్, తన్వీర్ ఆసీఫ్, శివకుమార్, జయప్రకాష్, రాహుల్, నాగరాజు, డీ. శ్రీధర్, రామకృష్ణ గౌస్, ఈ. గాంధీ ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

కల్వకుర్తి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తికి న్యాయాధికారి ఒక రోజు జైలు శిక్ష విధించారు. ఎస్ఐ జి.మాధవరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన పద్మారావు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడటంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. అతడికి ఒక రోజు జైలు శిక్ష, వంద రూపాయల జరినామా విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు.

న్యూస్ బాక్స్

రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలి

● ప్రిన్సిపాల్ డాక్టర్ రామా ఓబులేష్


శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

వడ్డేపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయంలో ఆపదలో ఉన్న వారికి రక్తం అందించడం ద్వారా ప్రాణదాతలుగా నిలవాలని ప్రభుత్వ డిగ్రీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.రామా ఓబులేష్ అన్నారు. గురువారం శాంతినగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సిబ్బంది సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవలో కూడా భాగస్వాములు కావాలన్నారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసిన యువకులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

బల్గెరలో ఘనంగా శివస్వాముల మెట్లపూజ


బల్గెరలో మెట్లపూజలో పాల్గొన్న జడ్పీటీసీ మాజీ సభ్యురాలు శ్యామల దంపతులు

గట్టు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బల్గెరలో గురువారం శివస్వాములు మెట్లపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జడ్పీటీసీ మాజీ సభ్యురాలు శ్యామల, బీఆర్‌ఎస్ నాయకుడు హన్మంతు నాయుడు హాజరయ్యారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పలకలు వితరణ


స్కూల్ బ్యాగు, పలకలు అందుకున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

అయిజ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అయిజ మండలంలోని ఉప్పలక్యాంపు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన జయరాజ్ కుమారుడు అశోక్ బ్యాగులు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగం రావడంతో అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నల్లన్న, చైర్మన్ శాంతమ్మ, గ్రామస్థులు కర్రెన్న, బుడ్డన్న, కిరణ్‌కుమార్, వినోద్, శాంతిరాజ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భజన పోటీలు

అయిజ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అయిజలోని తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన భజన పోటీల్లో అయిజ మండలం పర్దిపూర్‌కు చెందిన మల్లికార్జున భజన మండలి మూడవ స్థానంలో, మారుతి భజన మండలి నాలుగవ స్థానంలో నిలిచాయి. గురువారం రాత్రి ప్రారంభమై శుక్రవారం ఉదయం వరకు జరిగిన ఈ పోటీల్లో అనంతరపురం జిల్లా మూలపెద్దమ్మ భజన మండలి ప్రథమ, నంద్యాల వీరాంజనేయస్వామి భజన మండలి ద్వితీయ స్థానంలో నిలిచాయి. కాగా అనంతపురం జిల్లా మండ్లవానిపల్లెకు చెందిన సాయి వీరాంజనేయస్వామి భజన మండలిలో కరీమ్‌సాబ్ అనే ముస్లిం వ్యక్తి ఉండడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

రేపు జాబ్‌మేళా

● జిల్లా ఉపాధి కల్పన అధికారి ప్రియాంక

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతకు వివిధ కంపెనీల్లో శిక్షణ, ఉపాధి కల్పించటకు ఈనెల 22న ఉదయం 11గంటలకు జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డాక్టర్ ప్రియాంక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18నుంచి 35సంవత్సరాల వయస్సు ఉండి ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, ఎలక్ట్రీషియన్ డిప్లమా, ఏదైనా డిగ్రీ అర్హత ఉండాలని తెలిపారు. ఎంపికైన నిరుద్యోగులకు శిక్షణ అనంతరం హైదరాబాద్, కర్నూల్, గద్వాల జిల్లాలోని కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.

నేడు శ్రీశైలంలో అన్నదానం

ధరూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం పుణ్యక్షేత్రంలో పెద్దచింతరేవుల శ్రీఆంజనేయస్వామి అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 21న అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు ఆద్య కేశవాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ధరూరు నుంచి నాలుగు డీసీఎంలలో 40క్వింటాళ్ల బియ్యం, కందిపప్పు, కూరగాయలు, వంట సామగ్రి, శ్రీశైలానికి తరలించామని తెలిపారు. 13సంవత్సరాలుగా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.

సంత్ సేవాలాల్ మార్గం అనుసరణీయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి


సంప్రదాయ బంజారా నృత్యం చేస్తున్న కేటీదొడ్డి కేజీబీవీ విద్యార్థినులు

● ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

● ఘనంగా సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి

గద్వాల టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శాంతి, అహింస, స్వచ్ఛత, మానవీయ విలువలను ఆచరణలో చూపించిన సంత్ సేవాలాల్ మహరాజ్ మార్గం నేటి సమాజానికి అనుసరణీయమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సేవాలాల్ మహరాజ్ 286వ జయంతిని గురువారం పట్టణంలోని పీజేపీ క్యాంప్ లక్ష్మీవెంకటేశ్వర కల్యాణ మండపంలో అధికారికంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే, బంజారా సమాజపు ఆశాజ్యోతి సేవాలాల్ స్ఫూర్తితో నియోజకవర్గంలోని తండాల అభివృద్ధి కోసం నిబద్ధతతో కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న జిల్లా కేంద్రంలో గిరిజన కమ్యూనిటీహాల్ నిర్మాణాన్ని త్వరలోనే సాకారం చేస్తామని హామీఇచ్చారు. అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మూఢవిశ్వాసాలు, జంతుబలికి వ్యతిరేకంగా బలమైన పోరాటం సాగించిన సేవాలాల్ జీవితచరిత్రను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్‌కు కార్యక్రమ నిర్వాహకులు సంప్రదాయ టోపీలు అందించి నృత్యంతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా సేవాలాల్ పేరున హోమం నిర్వహించారు. కేటీదొడ్డి మండలంలోని కేజీబీవీ విద్యార్థినులు బంజార సంప్రదాయ దుస్తులు ధరించి చేసిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజశేఖర్, మాజీ కౌన్సిలర్లు మురళి, శ్రీను, మాజీ సర్పంచు వీరేష్ నాయక్, షకూర్, కురుమన్న, నాగేంద్రయాదవ్, నరేంద్ర నాయక్, సురేష్ నాయక్ ఉన్నారు.

● ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే

గద్వాల న్యూటౌన్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం జిల్లా కేంద్రంలోని 12వ వార్డుకు చెందిన మహేష్‌కు మెరుగైన చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బాబర్, నాయకులు ఉన్నారు.

న్యాయం గెలిచింది.. ప్రజల కల నెరవేరింది: ఎమ్మెల్యే

గద్వాల(మల్దకల్), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మల్దకల్ మండల కేంద్రంలోని బస్టాండ్ స్థలం వివాదం న్యాయస్థానంలో గెలిచింది ప్రజల కల నెరవేరిందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి మండల కేంద్రంలోని బస్టాండ్ స్థలాన్ని ప్రజలకు అంకితం చేసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మల్దకల్ మండల కేంద్రంలో బస్టాండ్ స్థలాన్ని కొంతమంది కబ్జా చేశారని అన్నారు. దీని విషయంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ప్రజలకు న్యాయమైన తీర్పు వచ్చిందని అన్నారు. దశాబ్దాల కల సాకారం అయ్యిందని చెప్పారు. ఇక్కడ శ్రీ స్వయంభువు వేంకటేశ్వర స్వామి ఆలయం ఉండటం వల్ల బ్రహ్మోత్సవాలు జరుగుతాయని వేలసంఖ్యలో భక్తులు వస్తారని అన్నారు. ఇక్కడ బస్టాండ్ ఏర్పడితే అభివృద్ధి జరుగుతుందని వివరించారు. వ్యాపారకేంద్రంగా మారడంతో అనేక మందికి ఉపాధి అవకాశాలు ఉంటాయని వివరించారు. గ్రామాల నుంచి ప్రజలు మండల కేంద్రానికి రాకపోకలు సాగించడంతో వ్యాపారాభివృద్ధి జరుగుందని అన్నారు.

వేంకటేశ్వర స్వామి దీవెనలతో తాను రెండుసార్లు ఎమ్మెల్యే అయ్యానని ప్రజల సేవ కోసం పనిచేసే అవకాశం కల్పించిన అందరికీ రుణపడి ఉంటానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, రాజారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వీరన్న, మధుసూదన్‌రెడ్డి, పెద్దపల్లి అజయ్, ప్రహ్లాద్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, చక్రంరెడ్డి, తూంకృష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో బోధన సులభతరం


మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

● ఎంపీడీవో రామకృష్ణ

వడ్డేపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా బోధనలో అనేక మార్పులు చేటుచేసుకున్నాయని, ఈక్రమంలో టెక్నికల్ లెర్నింగ్ మెథడ్ ద్వారా విద్యను బోధించడం ద్వారా సులభతరమవుతుందని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. సర్వశిక్షా అభియాన్, ఎంఏఎఫ్ ఆధ్వర్యంలో గురువారం వడ్డేపల్లి మండలం జులేకల్ గ్రామంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో సబ్జెక్టు మేళా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక బోధన వల్ల పాఠాలను విద్యార్థులు త్వరగా ఆకలింపు చేసుకుంటారన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు 70రకాల టీఎల్ఎంలు తయారు చేశారన్నారు. ఎంఈవో నర్సింహులు మాట్లాడుతూ విద్యార్థులకు వినూత్నంగా నేర్పిస్తే దానికి అనుగుణంగా వారి ఆలోచన, చదివే విధానంలో మార్పులు చోటుచేసుకుంటాయన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు జి.పుష్పలత అధ్యక్షతన తెలుగు, గణితం, ఈవీఎస్, ఇంగ్లిషు సబ్జెక్టుల వారీగా మూడవ తరగతి నుంచి ఏడవ తరగతి వరకు విద్యార్థులు వివిధ రకాల టీఎల్ఎం మెటీరియల్స్‌ను ప్రదర్శించి వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో క్లస్టర్ జీహెచ్‌ఎం అన్వర్‌ఉల్ హక్, ఏపీ చైర్మన్ స్రవంతి, పాఠశాలల హెచ్‌ఎంలు తేజ నాయక్, శేఖర్‌బాబు, మురళీధర్‌గౌడ్, యాదయ్య, సీఆర్‌పీఫ్ సభ్యుడు వెంకట్రాముడు, పరమేష్, ఎంఏఎఫ్ మండల ఇన్‌చార్జి హనిమిరెడ్డి, మొబిలైజర్ బడేసాబ్, వెంకటేష్, సుధాకర్, శశికళ ఉన్నారు.

పశువులకు వైద్యం

అలంపూరుచౌరస్తా, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండలంలోని భైరాపురంలో గురువారం డా. శిరిష ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఐదు ఆవులకు, 12గేదెలకు గర్భకోశ పరీక్షలు చేశారు. 30దూడలకు నట్టలనివారణ మందులు, మరో 12పశువులకు సాధారణ పరీక్షలు, చికిత్సలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది శివ, కృష్ణ, సావరయ్య ఉన్నారు.

నేడు ప్రతిభ ఉత్సవాలు

అలంపూరుచౌరస్తా, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లిలోని ప్రాథమిక పాఠశాలలో నేడు శుక్రవారం ప్రతిభ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో రామకృష్ణ తెలిపారు. మండల వ్యాప్తంగా 48మందికి పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నామని, వీరికి తెలుగులో రాయడం, చదవడం, గణితం, చిత్రలేఖనం తదితర అంశాలపై పోటీ పరీక్షలు ఉంటాయని, అరుగురు జడ్జిలు వీరి ప్రతిభను గుర్తిస్తారని తెలిపారు. ప్రతిభ చూపినవారికి ప్రోత్సాహకాలు ఇస్తామని తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

రాజోలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులో బుధవారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. ఆ వివరాలు.. కర్నూలు జిల్లా, ఎదురూర్ గ్రామానికి చెందిన చాకలి దుబ్బన్న(73) బుధవారం ఉదయం గ్రామం నుంచి మల్దకల్‌లో ఉంటున్న కూతురు వద్దకు వెళ్లి, తిరిగి వస్తుండగా రాజోలి శివారులోని భారత్‌మాల రహదారిలో బ్రిడ్జి వద్ద కాంక్రీట్ మిక్సర్ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో మృతుడి కాలు నుజ్జునుజ్జయ్యింది. స్థానికులు వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం ఉదయం 10:20 గంటల సమయంలో చాకలి దుబ్బన్న మృతి చెందాడు. బీహార్‌కు చెందిన లారీ డ్రైవర్ ఉపేందర్ నిర్లక్ష్యంగా లారీ నడపడం వల్ల ప్రమాదం జరిగిందని, మృతుడి కుమారుడు చాకలి మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎల్ఐసీలో క్లాస్ త్రీ, ఫోర్ ఉద్యోగాలు భర్తీ చేయాలి

● గద్వాల బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు ● గంటపాటు సమ్మె

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)లో క్లాస్ త్రీ, ఫోర్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని గద్వాల బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏఐఐఈఏ) సంఘం పిలుపు మేరకు ఉద్యోగులు గంటపాటు సమ్మె నిర్వహించారు. ఈసందర్భంగా గద్వాల బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు మాట్లాడుతూ ఎల్ఐసీలో ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌తో పాటు ఏఐఐఈఏ సంఘానికి గుర్తింపు ఇవ్వాలనే ప్రధాన డిమాండ్లతో సమ్మె చేశామని చెప్పారు. డిమాండ్లు పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూరజ్, ఉద్యోగులు పద్మావతి, రంగయ్య, చంద్రశేఖర్, నర్సింగ్, రాఘవేంద్ర, మల్లికార్జున్, సుదర్శన్, శివశంకర్, కృష్ణచైతన్య. శైలేష్, లక్ష్మీకాంత్ ప్రవీణ్, అమరేందర్ ఉన్నారు.

సమస్యలపై పుర కమిషనర్‌కు ఫిర్యాదులు


కమిషనర్ దశరథ్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న పెద్దఅగ్రహారం కాలనీవాసులు

గద్వాలటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు పది నెలలుగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ నిధులు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి కోరారు. గురువారం మునిసిపల్ కమిషనర్ దశరథ్‌ను కలిసి సీఐటీయూ అనుబంధ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ తరపున వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల వ్యక్తిగత ఖాతాల్లో ఎప్పటికప్పుడు నిధులు జమకాకపోవడం వల్ల అత్యవసర సమయాల్లో కార్మికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. దీంతోపాటు రిటైర్‌మెంట్ అనంతరం తమ నగదును పొందేందుకు కార్మికులు పలు అవాంతరాలను ఎదుర్కొంటున్నట్లు కమిషనర్ దృష్టికి తెచ్చారు. దీంతోపాటు కార్మికులకు ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలు ఇవ్వాలని, మూడు, నాలుగు నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉండటం వల్ల కుటుంబాల నిర్వహణ కోసం కార్మికులు అప్పులు చేసే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కాగా ఎలక్ట్రికల్ విభాగంలో పనిచేసే కిందిస్థాయి సిబ్బంది పట్ల లైన్‌మెన్లు కొందరు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులు ఏడాదికి రెండు జతల దుస్తులు, సబ్బులు, నూనెలు, పారిశుధ్యం కోసం వినియోగించే పనిముట్లను సకాలంలో అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నరసింహ, మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివ, రవి, కోశాధికారి మహేష్, రఘు, హనుమంతు, లలితమ్మ, నాగమణి, రామేశ్వరి, వెంకటేష్, రాము, పరశురాం, శివకుమార్ ఉన్నారు.

● అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

గద్వాల టౌన్ : పట్టణంలోని 32, 33 వార్డుల పరిధి, పెద్దఅగ్రహారం వెళ్లే దారిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని కాలనీవాసులు కోరారు. గురువారం మునిసిపల్ కమిషనర్ దశరథ్‌ను కలిసిన స్థానికులు కే.మోహన్‌రావు, సామవేదం వేణుగోపాలచారి, విజయ్‌మోహన్‌రెడ్డి, రఘునాథ్, చౌడేశ్వరరావు,శ్రీవాస్తవ్యులు ఫిర్యాదుపత్రం అందజేశారు. కాలనీకి వెళ్లే దారి పక్కన ఉన్న ఖాళీస్థలంలో చేపట్టిన నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మూడు అడుగుల మేరకు సెట్‌బ్యాక్ వదిలేసి కొత్తనిర్మాణం చేయాల్సి ఉందన్నారు. గతంలో కాలనీకి వెళ్లే దారికి ఆనుకుని ఉన్న డ్రైనేజీని ఆక్రమించి నిర్మాణం చేపట్టినందున భవిష్యత్‌లో పెద్దఅగ్రహారంలోని అహోబిళమఠం, లక్ష్మీనరసింహస్వామి ఆలయం, హనుమాన్ ఆలయాలకు వెళ్లే భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. మునిసిపల్ అధికారులు తక్షణం స్పందించి అక్రమ నిర్మాణాన్ని నిలిపి వేయాలన్నారు.

వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

● గట్టులో అన్ని మండలాల హెచ్‌ఎంలు, విద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గట్టు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. గురువారం గట్టు మండలంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాలలో పదవ తరగతి యాక్షన్ ప్లాన్‌పై అన్ని మండలాల ప్రధానోపాధ్యాయులు, విద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మండలాల వారీగా ఉత్తమ ఫలితాల కోసం చేపడుతున్న యాక్షన్ ప్లాన్, తీసుకుంటున్న ప్రత్యేక చర్యల వివరాలను హెచ్‌ఎంలు, ఎంఈవోలతో అడిగి తెలుసున్నారు. అనతరం కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది పదవ తరగతి పరీక్షల్లో జిల్లా 32వ స్థానంలో నిలిచిందని, ఈ సారి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. గట్టు, కేటిదొడ్డి మండలాలు వెనుకబాటు భావనను తొలగించి, ఉత్తమ ర్యాంకులు సాధించడంతో పాఉటు అక్షరాస్యతశాతం పెంచేందుకు విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలన్నారు. పరీక్షలు ఒక నెల మాత్రమే ఉన్నందున విద్యార్థులు తప్పనిసరిగా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, రోజువారి ప్రగతిని సమీక్షించాలని ఆదేశించారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, గత సంవత్సరం ప్రశ్నపత్రాలను అధ్యయనం చేయించాలన్నారు. విద్యార్థులకు 10/10 జీపీఏ సాధించేలా లక్ష్యాన్ని నిర్దేశించాలన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన వారికి తెలంగాణ అవతరణ దినోత్సవం లేదా, స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా యంత్రాంగం బహుమతులు అందజేస్తున్నదని తెలిపారు. అంతకుముందు కలెక్టర్ విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టు వర్క్స్‌ను పరిశీలించి, విద్యార్థుల సృజనాత్మకతను అభినందించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీఈవో అబ్దుల్ ఘని, స్పెషల్ ఆఫీసర్ గోవిందయ్య, షకీలా భాను, సంగీతలక్ష్మి, వెంకటేశ్వర్లు, ప్రియాంక, అక్బర్‌బాషా, ఎంపీడీవో చెన్నయ్య, హెచ్‌ఎంలు, ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రానివ్వొద్దు


మాట్లాడుతున్న అధికారి రామలింగేశ్వరగౌడ్

అయిజ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకుందామని జిల్లా పరిశ్రమల శాఖ, అయిజ మండల ప్రత్యేకాధికారి రామలింగేశ్వరగౌడ్ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీడీవో వెంకటయ్య, ఉపాధి హామీ సిబ్బంది, ఆయాగ్రామాల పంచాయతీ కార్యదర్శులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా, నివారణ చర్యలపై చర్చించారు. ఈవిషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

కొనసాగుతున్న చేనేత మగ్గాల పరిశీలన

రాజోలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రాజోలిలో చేనేత మగ్గాల పరిశీలన కొనసాగుతుంది. గురువారం రాజోలిలోని కొత్త గ్రామంలో ఏడీవో రాజేశ్వర్‌రెడ్డి చేనేత మగ్గాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం ప్రవేశపెట్టిన తెలంగాణ నేతన్న పొదుపు పథకానికి దరఖాస్తు చేసుకున్న కార్మికులు ప్రస్తుతం చేనేత వృత్తిలో ఉన్నారా, లేదా అని తెలుసుకునేందుకు ఇంటింటికీ తిరిగి పరిశీలిస్తున్నామని, మగ్గం ఉన్నవారికే ప్రభుత్వం అందించే చేనేత పథకాలు అందుతాయని తెలిపారు. ఆయనతో పాటు క్లస్టర్ సీడీఈ శివకుమార్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదాల్లో వేర్వేరు చోట్ల ఇద్దరి మృతి

గద్వాల క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి గుర్తుతెలియని యువకుడు (25) బుధవారం రాత్రి మృతి చెందాడని గురువారం గద్వాల రైల్వే హెడ్‌కానిస్టేబుల్ అశోక్ తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి. వనపర్తి, శ్రీరాంనగర్ రైల్వేస్టేషన్‌ల మధ్య బుధవారం రాత్రి గుర్తుతెలియని యువకుడు మృతి చెందగా మృతదేహాన్ని గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే గద్వాల రైల్వే పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు.

● ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి ఓ వ్యక్తి(45) మృతి చెందిన సంఘటన గద్వాల మానవపాడు రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకొంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ నుంచి సికిందరాబాద్‌కు వెళుతున్న (17024.) రైలు నుంచి గుర్తుతెలియని వ్యక్తి మానవపాడు రైల్వేస్టేషన్ సమీపంలో రైలులో నుంచి జారిపడి మృతి చెందాడు. ప్రస్తుతం మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఉత్సాహంగా స్వయం పాలన దినోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గద్వాలటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులే ఉపాధ్యాయులు, అధికారులుగామారి స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులుగా మారిన పదవ తరగతి విద్యార్థులు తరగతి గదుల్లో వివిధ సబ్జెక్టులపై బోధన చేశారు. హెచ్‌ఎంగా ఆదికేశవ, ఎంఈవోగా ఆసిఫ్, డీఈవోగా విజయేంద్ర, కలెక్టర్‌గా మేఘన వ్యవహరించారు. కార్యక్రమంలో పాల్గొన్న హెడ్‌మాస్టర్ ఇమ్మానుయేల్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందిస్తూ టెన్త్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

మిర్చి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదన్న

అలంపూరు ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పండిన ఎండుమిర్చిని రాష్ట్ర ప్రభుత్వం మిర్చిబోర్డును ఏర్పాటు చేసి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జీకే ఈదన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని క్యాతూరులో రైతులతో కలిసి ఎండుమిర్చి పంటను పరిశీలించారు. పంటను నిల్వ చేసుకోవడానికి గోదాములు లేక విక్రయించేందుకు మార్కెట్ సదుపాయం లేక సుదూర ప్రాంతాలకు తీసుకు వెళ్లినా సరైన ధర అందక ప్రైవేట్ వ్యాపారులకు పంటను తక్కువ ధరకు అమ్మి తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. దీనివల్ల రైతులకు పెట్టుబడి కూడా అందడం లేదనిఅన్నారు. పసుపు బోర్డు మాదిరిగా ఎండుమిర్చికి ప్రత్యేకమైన బోర్డును ఏర్పాటు చేసి ప్రభుత్వమే రైతుల నుంచి నేరుగా క్వింటా రూ.25 వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించకపోతే జిల్లా వ్యాప్తంగా ఎండుమిర్చి రైతులందరితో కలిసి వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగారు రఫీ, రైతు సంఘం మండల నాయకుడు గణేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, రైతులు రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, నరేష్, శ్రీనివాసులు, గణేష్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.


ఎండుమిర్చిని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు